క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


మృతి చెందిన రాజు

ఎల్కతుర్తి : నిద్రమాత్రలు మింగి చికిత్స పొందుతున్న వ్యక్తం బుధవారం మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తకొండలో చోటుచేసుకుంది. ఎస్సై సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామానికి చెందిన రాచకొండ రాజు (40) కొంత కాలంగా మానసికంగా, అనారోగ్య కారణాలతో బాధపడుతున్నాడు. అనారోగ్య విషయంలో మనస్థాపం చెందిన రాజు.. జనవరి 25న ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చుట్టుపక్కలవారు గమనించి చికిత్స నిమిత్తం ములకనూర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి పంపించారు. పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ రాజు తుదిశ్వాస విడిచాడు. మృతుని భార్య సబిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ఎల్కతుర్తి : మండలంలోని కోతులనడుమ గ్రామానికి చెందిన తిరుపతి ఎల్లమ్మ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. 50కిలోల బియ్యం, కొంత ఆర్థిసాయం అందించారు. అలాగే సూరారం గ్రామానికి చెందిన బుగ్గ రవి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయనను పరామర్శించి పండ్లు, ఆర్థిక సాయం అందించారు. అదే గ్రామానికి చెందిన ఎర్రబెల్లి రాధమ్మ మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు రమేష్, మహేందర్, భాస్కర్, తిరుమలరావు, వేణు, సందీప్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల చేయూత



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన బుల్లికొండ మౌనిక భర్త శ్రీనివాస్ ఇటీవల మృతి చెందాడు. మౌనికతో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు బుధవారం శ్రీనివాస్ చిత్రపటం వద్ద నివాళులర్పించి రూ. 10,500 మౌనికకు అందించారు. సామాజిక సేవకుడు అమ్మ అశోక్, మంద రత్నాకర్, కందగట్ల రాము, బొద్దుల రాజు, కోగిల హరీష్ పాల్గొన్నారు.

3న మండల సభ

శాయంపేట : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 3న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొనున్నట్లు పేర్కొన్నారు.

నేడు త్రీఫేజ్ సరాఫరాకు అంతరాయం

వేలేరు : పీచర, వేలేరు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో 33 కేవీ లైన్ మరమ్మతుల్లో భాగంగా గురువారం త్రీఫేజ్ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ కుమారస్వామి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు త్రీఫేజ్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సింగిల్ ఫేజ్ విద్యుత్ సరాఫరా యథావిధిగా ఉంటుందని పేర్కొన్నారు.

సొంతగూటికి భాస్కర్



పరకాల : బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బొచ్చు భాస్కర్ సొంత గూటికి చేరారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్న తీరును చూసి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

వేలేరు : చింతలతండాకు చెందిన మాలోతు మేగ్యా బెల్టుషాపులో మద్యం విక్రయిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిత తెలిపారు. 15 బీర్లు, 10 క్వాటర్ సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

సర్పంచ్‌ల సేవలు మరువలేనివి

- జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్
- ముగిసిన సర్పంచ్‌ల పదవీకాలం
- శాలువాలతో సత్కరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు


ఎల్కతుర్తి : ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లను సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్

ఎల్కతుర్తి: గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు అందించిన సేవలు మరువలేనివని జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ అన్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో బుధవారం భీమదేవరపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సర్పంచ్‌లు ఐదేళ్ల పాటు గ్రామాల్లో చేసిన సేవలను కొనియాడారు. గ్రామాభివృద్ధికి వారు చేసిన సేవలు చిరకాలం నిలిచిపోతాయన్నారు. రాజకీయాల్లో మరిన్ని అవకాశాలను అందిపుచ్చుకుని సేవలందించాలని ఆకాంక్షించారు. సర్పంచ్‌లకు రావల్సిన పెండింగ్ బిల్లుల కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామ సర్పంచ్‌లకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అలాగే వారికి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జక్కుల అనీతరమేష్, జెడ్పీటీసీ వంగ రవీందర్, ఎంపీడీఓ భాస్కర్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీఓ నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజమల్లారెడ్డి, పీఆర్ ఏఈ సంతోష్, వైస్ ఎంపీపీ మాడుగుల ఎర్రా, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సురేందర్, కార్యదర్శులు, పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని తహసీల్దార్ జ్యోతివలక్ష్మీదేవి అన్నారు. సర్పంచ్‌ల పదవీకాలం బుధవారంతో ముగియడంతో మండల కేంద్రంలోని రైతువేదికలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు అందించిన చొరవ మరవలేనిదని అన్నారు. అనంతరం ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో డంపింగ్‌యార్డు, స్మశానవాటిక, పల్లెప్రకృతివనాలు, నర్సరీలు, రైతు వేదికల నిర్మాణంలో సర్పంచ్‌లు ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చుకున్నారని అన్నారు. ఒకరికొకరు పోటీపడి అభివృద్ధి పనులు చేశారని అన్నారు. ఈ సదర్భంగా సమావేశంలో పాల్గొన్న దామెర సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు అప్పులు చేశామని, గత ప్రభుత్వం బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతనం దామెర సర్పంచ్ శ్రీరాంరెడ్డి, ముస్త్యాలపల్లి సర్పంచ్ వడ్డెపల్లి శ్రీనివాస్, తక్కళ్లపహాడ్ సర్పంచ్ బింగి రాజేందర్‌ను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రంగాచారి, ఏపీఓ శారద, ఏపీఎం ఝాన్సీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి, విద్యుత్ ఏఈ గుర్రం రమేష్, ఏఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది, కారోబార్లు పాల్గొన్నారు. కాగా మండలంలో 14 మంది సర్పంచ్‌లకు గాను ముగ్గురు మాత్రమే సమావేశానికి హాజరవడం గమనార్హం.


దామెర : సర్పంచ్‌లను సన్మానిస్తున్న అధికారులు


ధర్మసాగర్ : సర్పంచ్‌ను సన్మానిస్తున్న అధికారులు

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్ : గ్రామపంచాయతీ పాలకవర్గం పదవీ కాలం ఫిబ్రవరి 1న ముగియనున్న నేపథ్యంలో స్థానిక సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు గ్రామ పంచాయితీ కార్యాలయంలో బుధవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు హాజరై మాట్లాడుతూ.. పాలకవర్గ సభ్యులు గత 5 సంవత్సరాలుగా గ్రామాభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. అనంతరం పాలకవర్గ సభ్యులను, జీపీ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ జవహర్‌రెడ్డి, సర్పంచ్ ఎర్రబెల్లి శరత్, కార్యదర్శి నాగపురి మహేష్, ఉపసర్పంచ్ బొడ్డు అరుణ, కారోబార్ చల్లా మహేందర్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వార్డు సభ్యులు, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


వేలేరు : సర్పంచ్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ సమ్మిరెడ్డి

వేలేరులో..

వేలేరు : గ్రామపంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగిసిన సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బంది బుధవారం ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎంపీపీ సమ్మిరెడ్డి, సర్పంచ్ గాదె ధర్మారెడ్డి, వివిధ గ్రామాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోదండరామ్‌ను అడ్డుకోవడం సరికాదు

కేయూ క్యాంపస్: రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన ప్రొఫెసర్ కోదండరామ్‌ను శాసనమండలిలోకి అడుగు పెట్టనీయకుండా అడ్డుకోవడం సరికాదని పూలే ఆశయ సాధన సమితి (పాస్) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమితులైన ఉద్యమ నేత కోదండరాం నియామకాన్ని అడ్డుకునే కుట్రలను వ్యతిరేకిస్తూ పాస్ ఆధ్వర్యంలో కేయూ క్యాంపస్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి బుధవారం వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మల్లేశ్వర్ మాట్లాడుతూ గవర్నర్ కోటాలో నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవీ భర్తీ మొదటి నుంచి వివాదాలకు దారితీసేందుకు కారణం బీఆర్‌ఎస్ పార్టీ వైఖరే కారణమని విమర్శించారు. పాస్ కార్యదర్శి డాక్టర్ శివనాగయ్య, డాక్టర్ శంకర్, వెంకన్న, శివకృష్ణ, సాయిప్రమోద్, అన్నపూర్ణ పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న సంగని మల్లేశ్వర్, తదితరులు

బీఆర్‌ఎస్‌ది కుటిల నీతి

హన్మకొండ: ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయనీయకుండా అడ్డుకోవడం బీఆర్‌ఎస్ పార్టీ కుటిల నీతికి, అనైతిక, విషపూరిత రాజకీయ క్రీడకు నిలువెత్తు నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ రాగమళ్ల పరమేశ్వర్ విమర్శించారు. ఇలాంటి నీచమైన చర్యను తెలంగాణ సమాజం క్షమించదని ఒక ప్రకటనలో తెలిపారు.

రహదారి భద్రతపై వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న అధికారులు

ఖిలా వరంగల్: జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా వరంగల్ జిల్లా రవాణాశాఖ ఆర్టీఓ రంగారావు ఆధ్వర్యంలో రహదారి భద్రతపై బుధవారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. వరంగల్ హంటర్‌రోడ్డులోని జ్యోతిరావు పూలే గురుకులంలో ఎంవీఐ కోల రవీందర్, రమేష్‌రాథోడ్ పర్యవేక్షణలో రహదారి భద్రతపై వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్టీఓ రంగారావు మాట్లాడుతూ రోడ్డు భద్రతపై వాహనదారులు అవగాహన పెంచుకుంటే ప్రమాదాలు తగ్గుతాయని వివరించారు. ఏకాగ్రతగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. అతివేగం ప్రమాదకరమని, హెల్మెట్ వాడి ప్రమాదాల బారినుంచి రక్షణ పొందాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రైవేట్ విద్యాసంస్థల బస్సుల అసోసియేషన్ అధ్యక్షుడు గాదె స్వరూప్‌రెడ్డి, ఏఎంవీలు శాలిని, స్వర్ణలత, డీబీఏ శ్రీధర్‌రెడ్డి, హోంగార్డులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టెమ్ స్పార్క్‌కు గురుకులం విద్యార్థులు

మడికొండ: జాతీయ స్థాయి స్టెమ్ స్పార్క్‌కు సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైె నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 6వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించిన స్టెమ్ స్పార్క్ ఇన్నోవేషన్ ఫెస్ట్ 2023-24లో ఫూట్ స్టెప్ ఎలక్ట్రిసిటీ జనరేటింగ్ సిస్టం ప్రాజెక్ట్‌ను పాఠశాల పదవ తరగతి విద్యార్థులు ప్రదర్శించి మొదటి 5వ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ మల్లారెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టును ఫిబ్రవరి 1, 2వ తేదీల్లో బెంగుళూరు ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరగనున్న జాతీయస్థాయి స్టెమ్ స్పార్క్‌లో ప్రదర్శించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు గైడ్ ఉపాధ్యాయురాలు కే.జ్యోతి, విద్యార్థులు ఆర్.శృతి, ఎల్.రమ్యను రీజనల్ కోఆర్డినేటర్ విద్యారాణి, తదితరులు అభినందించారు.


ప్రాజెక్టుతో విద్యార్థులు, గైడ్

దర్గా ఉత్సవాలను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న పీఠాధిపతి

కరీమాబాద్: ఉర్సు దర్గా ఉత్సవాలను విజయవంతం చేయాలని పీఠాధిపతి సయ్యద్ మొహినొద్దీన్ అహ్మద్ ఖుస్రూర్ ఖాద్రీ (హసీబ్‌పాషా) కోరారు. ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఉర్సులో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు 468వ ఉర్సు దర్గా (హజ్రత్ సయ్యద్ జలాలుద్దీన్ షా జమాలుల్ బహర్), (సయ్యదనా మాషుక్ రబ్బానీ) ఉత్సవాలు జరుగుతాయని వివరించారు. దేశ నలుమూలల నుంచి ప్రజలు తరలివస్తారని చెప్పారు. ఉత్సవాలకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తరపున ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సయ్యద్ జమాలుద్దీన్ అహ్మద్ ఖాద్రీ, సయ్యద్ మొహినొద్దీన్, మత పెద్దలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఫిబ్రవరి 1న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. పింజర్ల, ఏనుగుల గడ్డ, రాగన్న దర్వాజ, రాయపుర, బ్రాహ్మణవాడ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రక్తదానంలో ముందుండాలి

వరంగల్ స్పోర్ట్స్: రక్తదానం చేసేందుకు యువత ముందుండాలని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను నిలబెట్టాలని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి సూచించారు. తలసేమియా వ్యాధిగ్రస్తుల సహాయార్థం హనుమకొండలోని రామప్ప పోలీస్ అకాడమీలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అకాడమీలో వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతున్న 56మంది అభ్యర్థులు రక్తదానం చేశారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన రామప్ప అకాడమీ చైర్మన్ ఐలి చంద్రమోహన్‌గౌడ్‌ను అభినందించారు. కార్యక్రమంలో పెద్ది వెంకటనారాయణ గౌడ్, ఐలి వంశీకృష్ణ, సంతోష్‌రావు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

మడికొండ: డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి 2రోజుల పాటు జైలుశిక్ష విధించినట్లు మడికొండ ఇన్‌స్పెక్టర్ గుజ్జెటి వేణు తెలిపారు. మడికొండ చౌరస్తాలో మంగళవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన మడికొండ గ్రామానికి చెందిన వ్యక్తిని న్యాయమూర్తి విద్యాసాగర్‌రావు ఎదుట ప్రవేశపెట్టగా జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు సీఐ వివరించారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

విద్యారణ్యపురి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఆయా జిల్లాల పరిధిలోని పట్టభద్రులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చాంప్ల నాయక్, ప్రధాన కార్యదర్శి ఎండీ.అబ్దుల్ ఘని కోరారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లోనైనా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

5న క్రిస్టియన్ జేఏసీ సదస్సు

వరంగల్ చౌరస్తా: హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ఈనెల 5న జరగనున్న తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ సదస్సును విజయంతం చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ చెరుకూరి రత్నరాజ్ కోరారు. వరంగల్ రామన్నపేటలో సదస్సు పోస్టర్లను బుధవారం విడుదల చేశారు.

రాష్ట్రపతి అవార్డు గ్రహీతకు అభినందన


లక్ష్మీప్రియను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

కాజీపేట రూరల్: రాష్ట్రీయ బాల్ పురస్కార్ అవార్డును రాష్ట్రపతి ద్రౌపతిముర్ము నుంచి అందుకున్న కాజీపేట ఫాతిమానగర్ మాంట్‌ఫోర్టు పాఠశాల విద్యార్థి పెండ్యాల లక్ష్మీప్రియను పాఠశాలలో బుధవారం అభినందించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన వేడుకల్లో బాలపురస్కార్‌ను రాష్ట్రపతి నుంచి లక్ష్మీప్రియ అందుకుంది. అలాగే, సెయింట్ బాయిస్ మాంట్‌ఫోర్టు 351వ వార్షికోత్సవాన్ని బుధవారం జరిగాయి. కార్యక్రమంలో మాంట్‌ఫోర్టు స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ విన్సంట్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ దాపెడ్డో, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో 'గద్దర్' పాత్ర కీలకం


గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు చేపట్టిన ఉద్యమంలో ప్రజా యుద్దనౌక గద్దర్ పాత్ర వెలకట్టలేనిదని జేఏసీ, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని అంబేడ్కర్ చౌక్ వద్ద బుధవారం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజా యుద్దనౌక గద్దర్ తెలంగాణ ఉద్యమ పోరాటంలో అలుపెరుగకుండా తన ఆటపాటలతో ఉద్రూతలు ఊగించి ఉద్యమాన్ని ఉవ్వేత్తున ఎగిసిపడేలా చేశారని కొనియాడారు. రాష్ట్ర సాధనలో గద్దర్ పాత్ర మరవలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ, ప్రజా సంఘాల నాయకులు డ్యాగల సారయ్య, వెంకటస్వామి, కండె సుధాకర్, ఊస కోయిల ప్రకాశ్, రమేష్, సందానందం, భిక్షపతి, స్టాలీన్, చందర్, మధుకర్, చక్రపాణి, బాబు, అయిలయ్య, సురేష్, మాడుగుల గోపి, బొల్లపల్లి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుతాం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి

పరకాల : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. దేశంలో ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు అవినీతి నిర్మూలనలో మోదీ సర్కార్ తీసుకున్న నిర్ణయాలకు యావత్తు దేశ ప్రజానీకం గర్విస్తుందన్నారు. దేశంలో ఉగ్రవాద, తీవ్రవాద కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంలో మోదీ సర్కార్ సలఫమైందన్నారు. అందుకే దేశ ప్రజలు కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వాన్ని కోరుకుంటుందన్నారు. పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాచం గురుప్రసాద్, సత్యనారాయణరావు, దేవునూరి మేఘనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్, మండల అధ్యక్షుడు పుట్ట రవీందర్, దుబాసి వెంకటస్వామి, సంఘ పురుషోత్తం పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : టీపీటీఎఫ్ (తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్ ఫెడరేషన్) ఆధర్యంలో ఫిబ్రవరి 11,12వ తేదీల్లో ఖమ్మం జిల్లాలో జరిగే టీపీటీఎఫ్ ద్వితీయ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి పిలుపునిచ్చారు. బుధవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరు, వంగర, భీమదేవరపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతరాలు లేని విద్యనందించడం ప్రభుత్వ బాధ్యత ప్రజల హక్కు అనే ఎజెండాగా తీసుకొని రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు హాజరు కానున్నట్లు వెల్లడించారు. మహాసభలకు ఉపాధ్యాయులు, సంఘం నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చందుపట్ల రాజేంద్రం, రమేష్, కొమురయ్య, శంకర్‌రెడ్డి, పరమేశ్వర్, శ్రీకాంత్, చిరంజీవి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, ఎల్లయ్య, స్టాలీన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శంకర్

దామెర : రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాని ఎంపీపీ కాగితాల శంకర్ అన్నారు. మండలంలోని ముస్త్యాలపల్లిలో బుధవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించి హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మట్లాడుతూ.. హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లినా చట్టపరమైన చర్యలు చేపట్టి హక్కుల సాధనకు కృషి చేయాలని సూచించారు. పౌరులందరికీ రాజ్యాంగం సమానమైన హక్కులు కల్పించిందని అన్నారు. ఒకరిపై ఇంకొకరు వివక్ష చూపినట్లయితే శిక్షార్హులని వెల్లడించారు. ప్రతి పౌరుడు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు భాస్కర్‌రెడ్డి, సంపత్, సర్పంచ్ వడ్డెపల్లి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ధర్మారెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, ల్యాప్‌టాప్ బహూకరణ


పుస్తకాలు, ల్యాప్‌టాప్ అందజేస్తున్న విజయ్‌చందర్‌రెడ్డి, దయాకర్

దామెర : మండలంలోని ల్యాదెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అమెరికాలో ఉండే డాక్టర్ దివాకర్ జంధ్యం లైబ్రరీ పుస్తకాలు, ల్యాప్‌టాప్‌ను పంపించగా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఆర్ఐ వాసవి అసోసియేషన్ తరఫున గ్రామంలోని పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయడం అభినందనీయమని అన్నారు. జంధ్యం దయాకర్, పిట్టల రమేష్, మాందాటి శ్రీకాంత్, అన్నబోయిన రోహిత్, నన్నెబోయిన శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం



ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన అల్లునూరి శ్రీనివాస్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 1998-99లో అతనితో పదోతరగతి చదువుకున్న మిత్రులు బాధిత కుటుంబానికి చేయూతనిచ్చారు. తలోకొంత పోగు చేసి రూ.54,500 ఆర్థిక సాయం అందించారు. శ్రీనివాస్ భార్య, ఇద్దరు కూతుర్లను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. చిన్న నాటి మిత్రులు రాజు, ప్రదీప్, విద్యాసాగర్, భాస్కర్, వేణు, ఉదయ్ కుమార్, యాదగిరి, రవి కుమార్, మోహన్, శివాజీ, అనిల్‌కుమార్, రాజు తదితరులు ఉన్నారు. అలాగే వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు బాధిత కుటుంబ సభ్యులకు 50 కేజీల బియ్యం అందజేసినట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేష్ తెలిపారు.